క్లుప్తంగా

రైతులకు యూనిక్ ఐడీ తప్పనిసరి



మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: ప్రతి రైతు విశిష్ట సంఖ్య పొందాలని తహసీల్దార్ టి. సంజీవరావు, మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు తెలిపారు. శుక్రవారం రామభద్రపురంలో నిర్వహించిన ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రత్యేక కార్యక్రమంలో వ్యవసాయాధికారి రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రశాంత్, సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు చంద్ర, రమణారెడ్డి, వీఏఏలు సుమ, దయాసాగర్, రైతులు పాల్గొన్నారు.

పేర్లు ఆన్‌లైన్లో ఎక్కించుకోవాలి



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: రైతులు తమ పేర్లతో పాటు పొలం వివరాలు ఆన్‌లైన్లో ఎక్కించుకోవాలని తహసీల్దార్ సంజీవరావు కోరారు. మండలంలోని రామభద్రపురంలో రెండో విడత రీ సర్వేలో భాగంగా శుక్రవారం ఆయన రైతులతో మాట్లాడారు. రీ సర్వే డీటీ ప్రశాంత్‌కుమార్, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు షేక్ మున్ని, మస్తాన్వలి, వీఆర్వో చంద్రశేఖరరావు, ఏవో ప్రసాద్‌రావు, వీఎస్ మల్లికార్జునరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో తాగునీటి సమస్య ఏర్పడింది. దీంతో పాఠశాలలోని సుమారు 800 మంది విద్యార్థినులు రోజూ మధ్యాహ్న భోజన సమయం, ఇంటర్వెల్‌లో మంచినీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి తాగునీటి సమస్య వేధిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. వేసవి కాలం కావడంతో ఇంటి నుంచి బాటిల్‌లో తెచ్చుకున్న నీరు కొద్దిసేపటికే అయిపోతున్నాయి. దీంతో తాగేందుకు నీరు లేక గొంతు ఎండుతోందని బాలికలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో అధికారులు తాగునీటి సమస్య ఏర్పడినప్పుడు వాటర్ ఫిల్టర్ ఏర్పాటు చేసి నీటి సమస్య తీర్చారు. అయితే ఇటీవల ఆ ఫిల్టర్ మరమ్మతులకు గురైంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించడమో లేదా మున్సిపల్ ట్యాంకర్ ద్వారా తాగునీరు సరఫరా చేసి సమస్యను పరిష్కరించాలని బాలికలు కోరుతున్నారు.

రండి బాబూ..రండి
మీ ఇంటికే మద్యం!

- గ్రామాల్లో విచ్చలవిడిగా మద్యం విక్రయాలు
- పుట్టగొడుగుల్లా వెలసిన బెల్ట్‌షాపులు
- ఆటోల్లో మద్యం విక్రయం

దొనకొండ:

మద్యం మహమ్మారి పల్లెల్లో విలయ తాండవం చేస్తోంది. కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీ తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. వైఎస్సార్ సీపీ పాలనలో మండల కేంద్రానికే పరిమితమైన మద్యం దుకాణాలు.. నేడు విచ్చలవిడిగా గ్రామానికి ఒక బెల్ట్ దుకాణం వెలిసింది. కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు మద్యం లైసెన్స్ అప్పగించినట్లు పైకి చెప్తున్నా 99 శాతం టీడీపీ నాయకులకే అవి దక్కాయన్నది సత్యం. మద్యం దుకాణం ఎక్కడైనా నిర్వహించుకోవచ్చు.. అనేది కూటమి ప్రభుత్వం మద్యం పాలసీలో ఓ భాగం. అయితే ఈ మద్యం దుకాణాలకు అనుసంధానంగా గ్రామానికి ఒక బెల్ట్ షాపు పుట్టుకొచ్చింది. కొన్ని పల్లెల్లో కూటమి సానుభూతి పరుల మధ్య పోటీ పెరిగి అదనంగా దుకాణాలు ఏర్పాటు చేశారు.

ఆటోలో మద్యం దందా

మద్యం దుకాణాలు కొనసాగుతున్నా దొనకొండ 1, 2, చందవరం గ్రామాల్లో బెల్ట్ షాపులు నడుస్తున్నాయి. పల్లెల్లోని బంకులు, షాపుల్లోనే కాదు.. ఇంటి వద్దే మద్యం విక్రయిస్తున్నా పోలీసు యంత్రాంగం చోద్యం చూస్తుండటం విమర్శలకు తావిస్తోంది. కొంతమందిపై పోలీసులు కేసులు నమోదు చేసినా దందా ఆగడం లేదు. స్థానిక కూటమి నాయకుల అండ చూసుకుని మద్యం వ్యాపారం చేస్తున్నారు. నాయకుల ఒత్తిళ్లతో బెల్ట్‌షాపులపై ఎక్సైజ్ అధికారులతో పాటు పోలీసులు కూడా దాడులకు వెనుకాడుతున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్సైజ్ అధికారులు మామూళ్ల మత్తులో ఉండటంతో బెల్ట్‌షాపులు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయి. గ్రామాల్లో అనధికారికంగా మద్యం విక్రయాలకు వేలం నిర్వహించే సంస్కృతి కూటమి ప్రభుత్వంలో మళ్లీ మొదలైంది. బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒక క్వార్టర్‌పై రూ.50 నుంచి రూ.60 వరకు అదనంగా వసూలు చేస్తున్నారు. రుద్రసముద్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బెల్ట్‌షాపుల యజమానులు మద్యం విచ్చలవిడిగా విక్రయిస్తున్నారు. గత నెలలో ఆ గ్రామంలో తహసీల్దార్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తుండగా భూమి సమస్యలు కన్నా బెల్ట్‌షాపులు ఎక్కువయ్యాయని, మద్యం తాగి కొన్ని కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, మద్యం మా ఊరికి రాకుండా చూడాలని తహసీల్దార్‌కు కొంత మంది మహిళలు వినతి పత్రం అందజేశారు. అయినా ఆ గ్రామంలో బెల్ట్‌షాపుల జోరు తగ్గలేదు. మద్యం తమ గ్రామంలో దొరుకుతుండటంతో యువకులు తమ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు.



రుద్రసముద్రంలో ఆటోలో తరలిస్తున్న మద్యం బాక్స్‌లు

వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లకు అభినందనలు



కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న నాయకులు, కార్యకర్తలు

దొనకొండ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్‌గా నియమితులైన కాకర్ల కృష్ణారెడ్డిని పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉండి తన వంతు సహకారం అందించి వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని కృష్ణారెడ్డి తెలిపారు. కృష్ణారెడ్డిని నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు కాలూరి అజయ్ రమణ, జిల్లా యాక్టివ్ సెక్రటరీ బత్తుల వెంకట సుబ్బయ్య, మండల నాయకులు నగేష్, వల్లపునేని వీరాచారి, దూదేకుల ఇస్మాయిల్, యరగొర్ల బాలకృష్ణ, ముదమంచు చిన్న ముసలయ్య, పులిమి శివ, కె.ప్రసాద్, చింతగుంట్ల నాగార్జున, హుసేనయ్య, విజయ్ పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): వైఎస్సార్ సీపీ దర్శి మండల కన్వీనర్‌గా వరుసగా నాలుగోసారి ఎంపికైన వెన్నపూస వెంకటరెడ్డి అలియాస్ మహేష్‌ను పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు. వెంకటరెడ్డి 2011 నుంచి పార్టీ మండల కన్వీనర్‌గా కొనసాగుతున్నారు. వైఎస్ జగన్‌మోహనరెడ్డి అజెండాలను అమలు చేయడంలో నియోజకవర్గ స్థాయిలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ దర్శి నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలో నడుస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. పార్టీకి తన వంతు కృషి చేస్తున్న వెంకటరెడ్డికి వరుసగా నాలుగో సారి పార్టీ మండల కన్వీనర్ పదవి వరించడంపై ఆయన సన్నిహితులు, పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



వెన్నపూస వెంకటరెడ్డి

ఘనంగా మహిళా దినోత్సవం



దర్శి: మహిళలను సన్మానిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు



కురిచేడు: ఉద్యోగినులను సన్మానిస్తున్న నాయకులు



కురిచేడు: తహసీల్దార్ రజనీకుమారిని సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

దర్శి (కురిచేడు): మండలంలోని పోతవరం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు ధనిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మానవత సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, డైరెక్టర్లు రాజకేశవరెడ్డి, ఎస్ఎన్ సీహెచ్ సుబ్బారావు హాజరయ్యారు. నలుగురు ఉపాధ్యాయినులు, ఒకరు హెల్త్ డిపార్ట్‌మెంట్ నుంచి, ఒకరు అంగన్‌వాడీ కార్యకర్త, ఇద్దరు సచివాలయ మహిళా ఉద్యోగినులను సన్మానించారు. తొలుత సరస్వతి మాత విగ్రహానికి, సావిత్రిబాయి పూలే చిత్రపటానికి, ఝాన్సీ లక్ష్మిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఈ జగతికి మహిళే మూలాధారమని, మహిళ లేనిదే సృష్టి లేదని, నవీన కాలంలో మహిళల పాత్ర ముఖ్య భూమిక పోషిస్తోందని, మహిళలు ఉన్నత చదువులు చదివి లోకాన్ని ఉద్ధరించాలని పిలుపునిచ్చారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు, మిఠాయిలు అందజేశారు.

కురిచేడు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశపు హాలులో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళలను సన్మానించారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, తహసీల్దార్ జి.రజనికుమారి, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవీలత, జె.అన్నపూర్ణ శాంతి, పద్మ, నక్క విజయకుమారి, సుమతి, మూజిబిన్, పువ్వాడ సుజాత, శెట్టిపల్లి లక్ష్మమ్మలను సన్మానించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలను సన్మానించడం సంతోషంగా ఉందని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు వీవీ రమణారావు పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, డైరెక్టర్లు ఎస్.నాసరయ్య గుప్తా, వి.శ్రీనివాసరావు, ఐ.వెంకటనర్సిరెడ్డి, జీఏబీ నాగరాజు, పీఎల్ నారాయణ, కె.చిన్నబుజ్జి, నాగేంద్రబాబు పాల్గొన్నారు.

దర్శి (కురిచేడు): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో సంఘం దర్శి తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు ఎస్వీ సుబ్బారెడ్డి, మస్తాన్ నాయక్‌ల ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. కార్యక్రమానికి సంఘ జిల్లా అధ్యక్షుడు చిన్నపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, కార్యదర్శి వరకుమార్, సహాధ్యక్షుడు మసూద్ ఆలీ, ఒంగోలు పట్టణ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, ఉపాధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి, ఎంఈఓ రఘురామయ్యలు పాల్గొని సుమారు 30 మంది మహిళా ఉద్యోగినులను ఘనంగా సత్కరించారు.

మూత్ర విసర్జన గదులకు తాళం

- బహిరంగ ప్రదేశంలో మూత్రవిసర్జన

దర్శి (కురిచేడు): ఒక వైపు ప్రభుత్వాలు బహిరంగ మలవిసర్జనను నిర్మూలించాలని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నాయి. ప్రజల సౌకర్యార్థం పట్టణాల్లో పబ్లిక్ టాయిలెట్లు, మూత్ర విసర్జనశాలలు నిర్మించాయి. స్థానిక తహసీల్దార్, పోలీసుస్టేషన్, సబ్ ట్రెజరీ, సబ్‌జైలు ప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మించిన పబ్లిక్ టాయిలెట్ల గదులకు నిర్వాహకులు తాళం వేశారు. దీంతో వివిధ పనులపై దర్శి వచ్చిన ప్రజలు పబ్లిక్ ప్రదేశంలోనే మూత్ర విసర్జన చేస్తున్నారు. మున్సిపల్ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని, దీంతో ప్రజలు బహిరంగంగా మూత్ర విసర్జన చేస్తున్నారని, కార్యాలయాలకు వచ్చే ప్రజలకు దుర్వాసన వెదజల్లుతూ ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు. పరిసరాల పరిశుభ్రత ముఖ్యమని చెప్పే అధికారులు వారు నిర్వహించే పబ్లిక్ టాయిలెట్ల విషయంలో తాళాలు తీయక పోవడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే పబ్లిక్ టాయిలెట్లకు తాళాలు తీసి సహకరించాలని ప్రజలు కోరుతున్నారు.



పబ్లిక్ టాయిలెట్లకు తీయని తాళం

భర్త కనిపించడం లేదని ఫిర్యాదు

యర్రగొండపాలెం: తన భర్త కనిపించడం లేదని భార్య మంగమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. మండలంలోని పాతగోళ్లవిడిపి గ్రామానికి చెందిన బొమ్మనబోయిన ఎల్లయ్య కుటుంబ సభ్యులతో గొడవపడి అలిగి ఎటో వెళ్లిపోయాడని, బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆయన జాడ తెలియలేదని ఆమె ఆ ఫిర్యాదులో పేర్కొంది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

రైతులకు రూ.750 కోట్ల రుణం

- ఎస్‌బీఐ ఆర్‌ఎం సూర్యప్రకాష్

యర్రగొండపాలెం: రైతులకు తమ బ్యాంకు ద్వారా పెద్ద ఎత్తున రుణాలు మంజూరు చేస్తున్నామని, 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.750 కోట్ల రుణాలు ఇచ్చేందుకు లక్ష్యంగా పెట్టుకోగా ఇప్పటి వరకు రూ.650 కోట్లు అందజేశామని, ఈ నెలాఖరులోపు రూ.100 కోట్ల రుణాలు రైతులకు ఇవ్వనున్నట్లు భారతీయ స్టేట్ బ్యాంక్ కందుకూరు రీజనల్ మేనేజర్ కె.సూర్యప్రకాష్ తెలిపారు. సంవత్సరానికి రూ.వెయ్యి చొప్పున ప్రమాద బీమా ప్రీమియం చెల్లిస్తున్న మండలంలోని సర్వాయపాలెం గ్రామానికి చెందిన బత్తాయి వ్యాపారి దూదేకుల సిద్దయ్య రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఆయన భార్య మొగలమ్మకు రూ.20 లక్షల చెక్కును శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయనతో కలిసిన విలేకరులతో ఆర్‌ఎం మాట్లాడారు. మృతి చెందిన సిద్దయ్యకు ముగ్గురు ఆడ పిల్లలు, ఇద్దరు మగపిల్లలు ఉన్నారని, ఆయన వ్యాపారరీత్యా వివిధ ప్రాంతాలకు వెళ్తుండటంతో ముందుచూపుగా ప్రమాద బీమా చెల్లించడంతో ప్రస్తుతం ఆయన కుటుంబానికి వెసులుబాటు లభించిందని ఆయన వివరించారు. ప్రస్తుతం రూ. 40 లక్షల పథకం అమలులో ఉందని, ప్రతి సంవత్సరం రూ. 2 వేల ప్రీమియం చెల్లించి ఆ పథకంలో సభ్యులుగా చేరవచ్చన్నారు. ఎస్‌బీఐలో రూ.500 నుంచి ప్రీమియం చెల్లించే ప్రమాద బీమా పథకాలు ఉన్నాయని, ఖాతాదారులు ఆ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతులకు కొత్తగా కిసాన్ సమృద్ధిరిన్ పథకం కింద రూ.50 కోట్లు, అగ్రి ఎంటర్ ప్రయిజ్ లోన్ కింద రూ.100 కోట్ల వరకు రుణాలు ఇచ్చేందుకు తమ బ్యాంకు సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. కందుకూరు రీజనల్ పరిధిలో మొత్తం 43 బ్రాంచీలు ఉన్నాయని, అందులో 22 బ్రాంచీలు రైతులకు సేవలు అందిస్తున్నాయన్నారు. ప్రజలు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, తాము కాయకష్టం చేసి సంపాదించుకున్న డబ్బును ఎక్కువ వడ్డీ ఇస్తామని చెప్పి మోసం చేస్తారని, బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తే వడ్డీతో పాటు రుణాలు కూడా పొందే అవకాశం ఉందని ఆర్‌ఎం సూచించారు. ఆయన వెంట బ్రాంచి మేనేజర్ కె.నాగేంద్రకుమార్ ఉన్నారు.



మొగలమ్మకు చెక్కు అందజేస్తున్న ఆర్‌ఎం సూర్యప్రకాష్

రేపు దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



వివరాలు వెల్లడిస్తున్న కమిటీ సభ్యులు

దర్శి (కురిచేడు): స్థానిక అద్దంకి రోడ్డులో ఎన్ఎస్‌పీ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ దుర్గాదేవి దేవస్థానం 13వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు ఆలయ అర్చకులు బాలకృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. వార్షికోత్సవం సందర్భంగా ఉదయం 5 గంటలకు పంచామృతాభిషేకాలు, 9 గంటలకు భజన కార్యక్రమం, మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం, సాయంత్రం 6 గంటలకు మహిళల కోలాటం, పాట కచేరిలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులందరూ హాజరై దుర్గమ్మ కృపాకటాక్షములకు పాత్రులు కావాలని కోరారు. జి.వెంకటేశ్వర్లు, శ్రీదేవిల కుమార్తెలు సాయి వెంకట నాగవర్ధిని, గురు వాసినిలు అన్నదానం చేశారు.

27న దండోరా ప్రభంజనం సభ



నినాదాలు చేస్తున్న నాయకులు

మార్కాపురం టౌన్: ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 27న గన్నవరంలో దండోరా ప్రభంజనం సభ నిర్వహిస్తున్నామని ఎమ్మార్పీఎస్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ పేర్కొన్నారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన మాదిగ రాజకీయ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం నియమించిన రంజన్ కమిషన్ వేగంగా నివేదిక సమర్పించాలని, ప్రస్తుత శాసనసభ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ తీర్మానం ప్రవేశపెట్టాలని కోరారు. ఏప్రిల్‌లో వర్గీకరణ అమలులోకి తేవాలన్నారు. గతంలో జస్టిస్ రామచంద్రరాజు కమిషన్ నివేదిక ఆధారంగా రిజర్వేషన్లు కేటాయించారన్నారు. దీంతో మాదిగ ఉపకులాలకు అధిక సంఖ్యలో ఉద్యోగాలు వచ్చాయన్నారు. డీఎస్సీ బ్యాక్‌లాగ్ ఉద్యోగ నియామకాల్లో ఏబీసీడీ వర్గీకరణ అమలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల డానియేల్, జాన్, జి.పాపయ్య, గుడిపాటి బాబు, మార్కాపురం డివిజన్ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ సభ్యులు బూదాల గురవయ్య, పుప్పాళ అనిల్, కె.చిన్నా, మోహన్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

మార్కాపురానికి సీఎం..
తర్లుపాడు రోడ్డుకు మోక్షం!

తర్లుపాడు: సీఎం చంద్రబాబు శనివారం మార్కాపురం పర్యటనకు వస్తుండటంతో తర్లుపాడు రోడ్డుకు ఒక్కసారిగా మోక్షమొచ్చింది. మార్కాపురం పట్టణ శివారులోని తర్లుపాడు రోడ్డులో సభా ప్రాంగణం, హెలీప్యాడ్ ఏర్పాటు చేశారు. ఆ మార్గం గుండా సీఎం కాన్వాయ్ రావాల్సి ఉంది. అయితే ఈ రోడ్డు గుంతలు పడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని, మరమ్మత్తులు చేయాలని కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నా అధికారులు కన్నెత్తి చూడలేదు. సీఎం పర్యటన ఖరారు కాగానే ఆర్అండ్‌బీ అధికారులు ఆగమేఘాల మీద తారు, కంకర తెచ్చి బుల్డోజర్లతో రాత్రికి రాత్రే రోడ్డు వేశారు. శుక్రవారం ఉదయం ఈ రహదారిలో వెళ్లే ప్రజలు ఒక్కసారిగా ఆశ్చర్యపోయారు. రాత్రిలేని కొత్త రోడ్డు ఉదయానికల్లా ఎలా వచ్చిందబ్బా అంటూ చర్చించుకున్నారు.



మార్కాపురం-తర్లుపాడు రోడ్డు మొన్నటి వరకు అలా..



సీఎం పర్యటన నేపథ్యంలో ఇప్పుడు ఇలా..